చెర్వుగట్టు జాతర విజయవంతానికి కృషి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఎమ్మెల్యే వేముల వీరేశం, అధికారులు

నార్కట్‌పల్లి, జనవరి 16 : వచ్చే నెల 2 నుంచి 9 వరకు జరిగే చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం చెర్వుగట్టు గుట్టపై ఆర్డీఓ అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. చెర్వుగట్టు క్షేత్రానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి వసతులు కల్పించాలన్నారు. కల్యాణం, అగ్నిగుండాలు జరిగే రోజుల్లో భక్తులు ఎక్కువగా వస్తారని, ఆ రెండు రోజులు అప్రమత్తంగా ఉండి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. విధుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ రమేశ్, ఎండోమెంట్ ఏసీ భాస్కర్, డీపీఓ వెంకయ్య, మండల ప్రత్యేకాధికారి సుచరిత, ఆలయ ఈఓ నవీన్, తాసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమేశ్, అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ శివరాంరెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- ఎస్పీ శరత్ చంద్రపవార్

నీలగిరి, జనవరి16 : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల మాసోత్సవాల్లో భాగంగా(మిషన్ త్రిబుల్‌ఆర్) గురువారం మండలంలోని చర్లపల్లిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు నాకేందుకులే అనుకోకుండా క్షతగాత్రులను రక్షించే ప్రయత్నం చేయాలన్నారు. వారిని రక్షించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇష్టాను సారంగా రోడ్లపైకి రావద్దని, అవసరమైన సందర్భాల్లో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు పోలీస్ వారి సూచనలు, సలహాలు పాటించాలన్నారు. జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వస్తుంటాయని, ఒకటికి రెండు సార్లు చూసి వాహనాలు రావడం లేదని నిర్ధారణ చేసుకున్న తర్వాతే రోడ్డు దాటాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్లు దాటవద్దన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐ రాఘవరావు, ఎస్ఐ సైదాబాబు, ఏఎస్ఐ ముత్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

- జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

కొండమల్లేపల్లి, జనవరి 16 : వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డివిజన్ స్థాయి వైద్యశాఖ అధికారులు, సూపర్‌వైజర్లతో రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి సంవత్సరంలో ఒకసారైనా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సమయంగా పాటించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు కేసా రవి, కృష్ణకుమారి, వైద్యాధికారులు అరుంధతి, పద్మ, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

శాలిగౌరారం, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో నేతాజీ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్, క్యారమ్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. వాలీబాల్ పోటీల్లో చిత్తలూరు గ్రామ జట్టు విజయం సాధించింది. విజేతలకు బీఆర్‌ఎస్‌వై మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్ రూ.10,016ను అందించారు. కార్యక్రమంలో జమ్ము రమేశ్, వడ్లకొండ పరమేశ్, కల్లూరి లింగయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒకే రోజు ముగ్గురి నేత్రాదానం

నీలగిరి, జనవరి16 : లయన్స్ క్లబ్‌ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐడొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గురి నుంచి నేత్రాలను సేకరించారు. నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీ మహాలక్ష్మి అపార్ట్‌మెంట్‌కు చెందిన కంకణాల శోభారాణి(58), ముషిరంబాగ్‌కు చెందిన ఇమ్మడి కృష్ణవేణి(72), రామ్‌నగర్‌కు చెందిన కర్నాటి వెంకటేశ్వర్లు(49) మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల సహకారంతో వారి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజర్ డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు మాట్లాడుతూ మనిషి మృతి చెందిన 6 నుంచి 8 గంటలోగా, మృతదేహం ఫ్రీజర్‌బాక్స్‌లో ఉంటే 12 నుంచి 15 గంటలలోగా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. ఒకరి నేత్రదానం వల్ల ఇద్దరు అంధులకు కంటి చూపును అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చిరునోముల చంద్రశేఖర్, మేనేజింగ్ డైరెక్టర్ హరినాథ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి నిమ్మల పిచ్చయ్య, కోశాధికారి శంకరయ్య, ఐఎంఏ అధ్యక్షుడు దామెర యాదయ్య, కార్యదర్శి డాక్టర్ రమేశ్, కోశాధికారి డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కళాకారుడికి ఆర్థిక సాయం



రవికి ఆర్థిక సాయం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నల్లగొండ రూరల్, జనవరి 16: ఆర్‌టీవీ ఫోక్ సాంగ్ యూట్యూబర్ రవి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న చాకలి ఐలమ్మ సంఘం, అమ్మ స్వచ్ఛంద సంస్థల సభ్యులు గురువారం అతడిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సురకారపు యాదగిరిగౌడ్, కంచర్ల రఘురాంరెడ్డి, పాలకూరి నరసింహగౌడ్, దోనాల లింగారెడ్డి, సంజీవ, ప్రసాద్, ప్రవీణ్, మహేశ్, శంకర్, నాగరాజు, లింగన్న పాల్గొన్నారు.

నిరుపయోగంగా బీసీ హాస్టల్ భవనం

- నిర్వహణలేక శిథిలావస్థకు చేరుతున్న వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- వినియోగంలోకి తేవాలని స్థానికుల వినతి

నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ భవనం

కట్టంగూర్, జనవరి 16 : మండల కేంద్రంలోని అంబటి వాగు సమీపంలో ఉన్న బీసీ బాలుర హాస్టల్ భవనాన్ని వినియోగించక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గత ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలతో బీసీ వసతి గృహానికి శాశ్వత భవనాన్ని నిర్మించింది. అయితే హాస్టల్‌లో విద్యార్థులు చేరక పోవడంతో దానిని మూసి వేశారు. భవనాన్ని వేరే కార్యాలయాలకు వినియోగించకుండా అలాగే వదిలేయడం, దాని నిర్వహణను ఎవరూ పట్టించుకోక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. హాస్టల్ భవనానికి ప్రహరీ లేకపోవడంతో కొంత మంది వ్యక్తులు లోనికి వెళ్లి మద్యం సేవిస్తున్నారు. ఆకతాయిలు భవనంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టి మండల కేంద్రంలో అద్దెభవనంలో కొనసాగిస్తున్న ఎస్సీ హాస్టల్‌ను అందులోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

27లోగా ఎంజీయూ మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి, జనవరి 16: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఎంజీయూ కళాశాలలో మూడో సెమిస్టర్ చదివే విద్యార్థులు ఈ నెల 27లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఎంజీయూ పరీక్షల విభాగం అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 29లోగా చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్స్ గమనించి సకాలంలో ఫీజు చెల్లించాలని కోరారు.

నేటి నుంచి నల్లగొండలో ఇస్తేమా

రామగిరి, జనవరి16 : నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల సాలానా ఇస్తేమా కార్యక్రమాన్ని ఈ నెల 17 నుంచి 19 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు నిర్వహణ బాధ్యులు సయ్యద్ అలీ మొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 61 సంత్సరాలుగా నల్లగొండ పట్టణంలో ఇస్తేమా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గా ఆవరణలో ఇస్తేమాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఢిల్లీ నిజామియా, మహారాష్ట్ర నుంచి 12 మంది ఉలేమాలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఇస్తేమాలో భాగంగా ఈ నెల 19న ఉదయం 11 గంటలకు దువా ఉంటుందని, ముస్లింలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్ష

రామగిరి, జనవరి16 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష గురువారం ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 877 మంది హాజరు కావాల్సి ఉండగా 650 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు క్షమాపణ చెప్పాలి : ఎమ్మార్పీఎస్ టీఎస్

చందంపేట(దేవరకొండ), జనవరి 16 : అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును కులం పేరుతో దూషించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూపాల్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు పొట్ట మురళిమాదిగ డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షమాపణ చెప్పని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం చందంపేట మండలాధ్యక్షుడు అందుగుల సైదులు మాదిగ, కొమ్ము ఉదయ్, తరి గోవర్ధన్, దర్శనం శివ, చాట్ల ప్రశాంత్, కుక్కల మల్లయ్య, ఈశ్వర్, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దేవరకొండ అధ్యక్షుడిగా ప్రభు



సంఘం నాయకుల నుంచి నియామక పత్రం అందుకుంటున్న ప్రభు

చందంపేట(దేవరకొండ), జనవరి 16 : ఎమ్మార్పీఎస్ దేవరకొండ పట్టణ అధ్యక్షుడిగా పొట్ట ప్రభును నియమించారు. సంఘం జాతీయ నాయకుడు కంబాలపల్లి వెంకటయ్య గురువారం ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడాలి

ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి

చిట్యాల, జనవరి 16 : జనాభా దామాషా ప్రకారం బహుజనులకు రాజ్యాధికారం కోసం పోరాడాలని, అందులో భాగంగానే మార్చి 15న హైదరాబాద్‌లో బహింగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. గురువారం చిట్యాల మార్కెట్ యార్డులో జరిగిన సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'జనాభాలో మేమెంతో అధికారం మాకంత' నినాదంతో నిర్వహించే సభకు అధిక సంఖ్యలో బహుజనులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాగిళ్ల యాదయ్య, బర్రె సంజీవ, కృష్ణయ్య, నర్సింహ, లింగస్వామి, గణేశ్, శంకర్, సత్తయ్య, అంజయ్య. యాదయ్య పాల్గొన్నారు.

అయిటిపాముల లిఫ్ట్ పనుల పరిశీలన

లిఫ్ట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం జనవరి 16 : కట్టంగూర్ మండలం అయిటిపాముల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ద్వారా మండలంలోని వల్లాల, పెర్కకొండారం గ్రామాలకు సాగునీరందించే పనులను గురువారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరిశీలించారు. మండలంలోని వల్లాల గ్రామ శివారులో నిర్వహిస్తున్న పైప్‌లైన్ పనులను పరిశీలించి మాట్లాడారు. లిఫ్ట్ నిర్మాణం పూర్తయితే వల్లాల గ్రామంలో 1600ఎకరాలు, పెర్కకొండారం గ్రామంలో 818 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ఆయన వెంట శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇంతియాజ్, నాయకులు కందాల సమరంరెడ్డి, పడాల రమేశ్ ఉన్నారు.

వృద్ధాశ్రమంలో లిఫ్ట్ ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, క్లబ్ సభ్యులు

నకిరేకల్, జనవరి 16 : లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.10లక్షలతో లిఫ్ట్ ఏర్పాటుకు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. నకిరేకల్ పట్టణ శివారులో ఉన్న వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వృద్ధులకు దుస్తులు, బెడ్ షీట్స్, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మోహన్‌రెడ్డి, చార్టర్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, సెక్రటరీ సూర్యచంద్రరావు, ట్రస్ట్ కార్యదర్శి యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, కోశాధికారి కె. లక్ష్మీనారాయణరెడ్డి, నవ్యక్లబ్ అధ్యక్షురాలు రమాదేవి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, తాటికల్ మాజీ సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు

చిట్యాల : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చిట్యాలలో నిర్వహించిన సీపీఎల్ క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం ఎమ్మెల్యే వీరేశం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మ, కాటం వెంకటేశం, మారగోని ఆంజనేయులు, గుడిపాటి లక్ష్మీనర్సింహ. ఎద్దులపురి కృష్ణ, గోలి గణేశ్, పరమేశ్ పాల్గొన్నారు.

సీఎమ్మార్ చెల్లించని రైస్ మిల్లర్లపై చర్యలు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జనవరి 16: కస్టం మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను సకాలంలో చెల్లించని మిల్లర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు వారి మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సివిల్‌సప్లై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన సీఎమ్మార్‌ను ఈ నెల 25లోగా వంద శాతం అందించాలన్నారు. యాసంగిలో 3,26,099 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా ఇందుకు గాను 2.21,747 మెట్రిక్ టన్నులు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటి వరకు 2,01,892 మెట్రిక్ టన్నులు చెల్లించారని, ఇంకా 19,856 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉందని తెలిపారు. సీఎమ్మార్‌ను సకాలంలో అందించని మిల్లులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మిల్లర్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చండూరు, జనవరి 16: చండూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ భవన నిర్మాణం కోసం పట్టణంలో ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ సంఘం నాయకులు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళావెంకన్న, కమిషనర్ మునవ్వర్ అలీకి వినతి పత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం అధ్యక్షుడు కొత్త అంజిబాబు, ప్రధాన కార్యదర్శి వర్కాల కిరణ్, కోశాధికారి తుమ్మల ఆంజనేయులు, సభ్యులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జనవరి 16: ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గురువారం మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ వద్ద టూటౌన్ పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేట్ లేని బుల్లెట్‌పై వెళ్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారించగా అది చోరీ చేసిన వాహనమని తేలింది. దాంతో అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయి జంక్షన్ గ్రామానికి చెందిన శీలం నాగరాజు కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నాడు. నర్సారావుపేట, వినుకొండ, మిర్యాలగూడ పట్టణాల్లో ఇండ్ల ముందు నిలిపి ఉంచిన నాలుగు పల్సర్, ఒక బుల్లెట్ బైక్‌ను చోరీ చేశాడు. వీటిని మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మునుకుంట్ల కృష్ణకు తక్కువ ధరకు విక్రయించాడు. దాంతో పోలీసులు కృష్ణను కూడా అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న నాలుగు పల్సర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. ఇద్దరు నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

సమావేశంలో టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐలు హరీశ్‌రెడ్డి, రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ప్రజలను తప్పదోవ పట్టించేందుకే కేటీఆర్‌పై కేసు

- మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, జనవరి16 : కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు, రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కై బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఈడీతో కేసు నమోదు చేయించిందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కేటీఆర్ ఎప్పటి కప్పుడు ఎండగడుతుండడంతో ఆయనపై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అందులో భాగంగానే కేటీఆర్‌పై పార్ములా-ఈ రేసింగ్‌పై తప్పుడు కేసు నమోదు చేయించారన్నారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించేందుకే ఫార్ములా ఈ- రేస్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై బీఆర్‌ఎస్ పార్టీ అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందించని కేంద్ర ప్రభుత్వం పార్ములా ఈ రేస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక్కై కేటీఆర్‌పై తప్పుడు కేసు నమోదు చేయించి ఈడీతో విచారణ చేపట్టడం సిగ్గుచేటన్నారు. ప్రశ్నించే గొంతుకను అణిచి వేయాలని చూస్తే ప్రజలు సహించరని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

- ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

నిడమనూరు, జనవరి 16 : ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ యాదవ్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుల దండోరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ దండోరా కళాకారుల ప్రచారయాత్ర గురువారం నిడమనూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా ప్రదర్శనకు మాదిగలు వేల సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, నాయకులు బొజ్జ చిన్నమాదిగ, బొజ్జ పుల్లయ్య, పోలె రవి, ఏర్పుల వెంకటయ్య, చిత్రం శ్రీను, ముదిగొండ్ల నాగయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్, ప్రతాప్, కళానేతలు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వం'



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

త్రిపురారం, జనవరి 16: కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమాలపై మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను, నాయకులు బెక్కం ఈదయ్య, దైద జానకమ్మ, వల్లపు సోమయ్య, జాని పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

మునుగోడు, జనవరి16 : గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని డీవైఎఫ్ఐ, టీపీటీఎల్‌ఎఫ్ నాయకులు అన్నారు. సంకాంత్రి పండుగ సందర్భంగ మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో యువతకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు గురువారం రాత్రి వారు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అయితగోని విజయ్‌కుమార్‌గౌడ్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి కట్టా లింగస్వామి, కట్ట వెంకన్న, సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు పాల్గొన్నారు.

మానుకోట సదస్సును విజయవంతం చేయాలి

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి



మాట్లాడుతున్న జానకిరెడ్డి

నందికొండ, జనవరి 16 : ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా మానుకోటలో నిర్వహించే ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి కోరారు. హిల్‌కాలనీలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఆమె వెంట కౌన్సిలర్ రమేశ్‌జీ, నాయకులు చంద్రమౌళి, వీరయ్య, కొండలు, వెంకోజీ, మధు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ



సెల్‌ఫోన్లను బాధితులకు అందించిన ఎస్ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి, జనవరి 16 : తమ సెల్‌ఫోను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేసిన వారి ఫోన్లను రికవరీ చేసి గురువారం ఎస్ఐ రామ్మూర్తి బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల వ్యవధిలో ఐదు గురు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకొని కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. సీఈఐఆర్ యాప్ ద్వారా వారి సెల్‌ఫోన్లు ఉన్న ప్రాంతాన్ని కనుక్కొని, రికవరీ చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదన సరికాదు

- బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్

మిర్యాలగూడ, జనవరి 16: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరాలను మరో 2 నుంచి 4 సంవత్సరాలు పెంచాలనే ప్రతిపాదన చేయడం సరికాదన్నారు. ఏ ఉద్యోగి కూడా విరమణ వయస్సు పెంపు కోరుకోవడం లేదన్నారు. ఇప్పటికే లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారని, ఈ తరుణంలో ఉద్యోగ విరమణ వయస్సు పెంచి వారికి అన్యాయం చేయవద్దని కోరారు. సమావేశంలో నాగేశ్వర్‌రావు, తుకారం, మాత్యా, తిరుపతి పాల్గొన్నారు.